క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

రామగుండం: రాష్ట్ర మత్స్య సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను నియమించినందుకు కృతజ్ఞతగా సంఘాల ప్రతినిధులు శనివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ను సన్మానించారు. ఇందులో జిల్లా ఫిషర్‌మెన్ అధ్యక్షుడు పల్లికొండ శ్యాం, గుమ్ముల శ్రీకాంత్, ఊటూరి రామస్వామి, గుమ్ముల శ్రీనివాస్, హన్మయ్య ఉన్నారు.

మంథనిలో కాముని దహనం



మంథని: మంథనిలో కాముని దహన వేడుకలను శనివారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీలేశ్వర సిద్దేశ్వర దేవాలయం ఎదుట, పెంజేరుకట్ట, మందాట వీధుల్లో కామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవు పిడికెలు, నెయ్యి, చకినాలు, పెరుగన్నం, కట్టెలు, పాత వస్తువులు, పసుపు, కుంకుమ మంటలో వేసి ప్రదక్షిణలు చేశారు. కాముని దహనం జరిగిన మరుసటి రోజే హోలీ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

వ్యవసాయంపై అవగాహన



వ్యవసాయ క్షేత్ర సందర్శనలో విద్యార్థులు

సుల్తానాబాద్: విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయంపై అవగాహన అవసరమని వివేకానంద పాఠశాల డైరెక్టర్ భూసారపు రవీందర్ అన్నారు. శనివారం సుల్తానాబాద్‌లో వివేకానంద పాఠశాల విద్యార్థులకు పంటలతీరు, రైతు ఔన్నత్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రవీందర్ మాట్లాడుతూ పంటలు ఎలా పండుతున్నాయి. వాటిని రైతులు ఏ విధంగా పండిస్తున్నారు, ఆహారం ఎలా వస్తుంది, అనే దానిపై క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గాయత్రి విద్యార్థులు



పెద్దపల్లిరూరల్: తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ప్రేరణ 2024లో గాయత్రి కాలేజీకి చెందిన బీకాం సీఏ ఫైనలియర్ విద్యార్థులు అరవింద్, ఠాకూర్ చిన్మయి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. వారిని కరస్పాండెంట్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మంథని: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ, వైస్ చైర్మన్ సీపతి బానయ్యకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు వినతిపత్రం అందించారు. నాలుగేళ్లుగా కార్మికులు సబ్బులు, నూనె, చెప్పులు, బట్టలు రావడం లేదన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 1 నుంచి కార్మికులకు ఒక పూట పని దినం చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్, నాయకులు రాజయ్య ఉన్నారు.

కిరాణ సామగ్రి సరఫరాకు టెండర్

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి దేవస్థానానికి కిరాణ సామగ్రి సరఫరా చేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆలయ ఈవో కాంతరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికాలం పాటు కిరాణ సామగ్రి సరఫరా చేయడానికి ముందుగా రూ.50వేల డిపాజిట్ చేసిన డీడీతో 26లోగా దరఖాస్తును దేవస్థానం ఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు

ముందు చూపే 'టీబీ'కి మందు

- అవగాహనతోనే వ్యాధి నయం
- జిల్లాలో పెరుగుతున్న బాధితులు
- నేడు ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం



సుల్తానాబాద్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కోల్‌సిటీ/సుల్తానాబాద్: వారానికి పైగా దగ్గు తగ్గడం లేదా? అయితే జర భద్రం. టీబీ వ్యాధి కావచ్చు. సకాలంలో చికిత్స తీసుకొని, క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుంది. నిర్లక్ష్యం చేస్తే మీ ప్రాణాలకే ప్రమాదం. అంతే కాదు పక్కనున్న వాళ్లకు కూడా ఈ వ్యాధి అంటుకుంటుంది. వ్యాధిపై అవగాహన ఉంటే టీబీని జయించవచ్చు. జిల్లాలో 2022లో 1163 మంది, 2023లో 311 మంది టీబీ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్నారు. ఇంకా 506 మంది ఇంకా మెరుగైన చికిత్స పొందుతున్నారు.

జీరో టీబీ గ్రామ పంచాయతీలు..

జిల్లాలో టీబీ కేసులు లేని తొమ్మిది గ్రామపంచాయతీలను టీబీ ముక్త్ గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. 'టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది.. టీబీపై విజయం.. రోజువారీ మందులతో తథ్యం' అనే నినాదంతో జిల్లా వైద్యాధికారులు విస్తృతంగా వ్యాధి నివారణకు అవగాహన కల్పిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు..

క్షయ(టీబీ) అనేది ఊపిరితిత్తులను ప్రభావం చేసే అంటువ్యాధి. ఇది మైకోబ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్(ఎంటీబీ) అనే బ్యాక్టీరియాతో వచ్చే అంటువ్యాధి. టీబీ రోగులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్లతో ట్యూబర్‌కూలై బ్యాక్టీరియా వ్యాపిస్తుంది. వ్యాధి సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేసినా చాపకింద నీరులా టీబీ అంటువ్యాధి వ్యాపిస్తూనే ఉంది. ప్రతి ఏడాది మార్చి 24న 'ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

సేవలు అందిస్తున్న కేంద్రాలు..

జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ ఏరియాలలో ఐదు టీబీ యూనిట్లు పని చేస్తున్నాయి.

అలాగే జిల్లాలో 24 ప్రైమరీ హెల్త్ ఇన్‌స్టిట్యూషన్స్ (పీహెచ్‌ఐ)లో సేవలందుతున్నాయి.

జిల్లాలోని గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రి, పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి, మంథని, సుల్తానాబాద్ సీహెచ్‌సీతోపాటు మేడారం, అంతర్గాం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, గర్రెపెల్లి, జూలపల్లి, శ్రీరాంపూర్, ఓదెల పీహెచ్‌సీల్లో 12 డీఎంసీ టీబీ కేంద్రాలు పని చేస్తున్నాయి.

వ్యాధి సోకుతుందిలా..

క్షయ అనేది ఒక అంటువ్యాధి. మైకో బ్యాక్టీరియం ట్యూబర్‌క్యూలోసిస్ అనే సూక్ష్మజీవితో సంక్రమిస్తుందని శాస్త్రపరంగా చెప్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటి ద్వారా వెలువడే తుంపర్ల ద్వారా ఈ బ్యాక్టీరియా గాలిలోకి వ్యాపిస్తుంది. ఇతరులు పీల్చినప్పుడు నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరుతుంది.

బాధితులకు ప్రభుత్వ ప్రోత్సాహం..

టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. టీబీ రోగికి ప్రతి నెలా రూ.500లు పౌష్టికాహారం కోసం అందజేస్తున్నారు. జిల్లాలో 2022 సంవత్సరంలో 1162 మంది, 2023 సంవత్సరంలో 730 మంది రోగులకు ప్రతి నెలా రూ.500 పొందారు. అయితే గత మూడు నెలలుగా పేషెంట్లకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం నిలిచిపోయిందని తెలిసింది.

బాధితులను గుర్తిస్తున్నాం



జిల్లాలో క్షయవ్యాధి బాధితులను గుర్తించి సీబీనాట్ యంత్రాల ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నాం. గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రిలో టీబీ పేషెంట్ల కోసం ఆరు పడుకల డీఆర్‌టీబీ ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశాం. టీబీ రహిత జిల్లాగా మార్చడానికి అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో, పెద్దపల్లి

జిల్లావ్యాప్తంగా సర్వే చేశాం



కేంద్ర ప్రభుత్వం టీబీ రహిత గ్రామాలను గుర్తించాలని ఆదేశించడంతో జిల్లావ్యాప్తంగా సర్వే చేశాం. తొమ్మిది గ్రామాలను గుర్తించి ఉన్నతాధికారుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. ప్రశంసపత్రంతో పాటు గ్రామాలకు నగదు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

– డాక్టర్ సుధాకర్‌రెడ్డి, టీబీ జిల్లా కంట్రోలర్ అధికారి, పెద్దపల్లి

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు



కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 30 మంది దివ్యాంగులకు ఉచితంగ కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. స్థానిక లయన్స్ క్లబ్ భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ గవర్నర్ ముద్దసాని ప్రమోద్‌కుమార్‌రెడ్డి కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు తానిపర్తి విజయలక్ష్మి, సెక్రటరీ బంక కళావతి, ట్రెజరర్ మనీషా అగర్వాల్, క్లబ్ సభ్యులు మేడిశెట్టి గంగాధర్, బంక రామస్వామి, డాక్టర్ వెంకటేశ్వర్లు, తానిపర్తి గోపాలరావు, మనోజ్‌కుమార్ అగర్వాల్, డి.లక్ష్మారెడ్డి, పోకల ఆంజనేయులు, వి.ఎల్లప్ప, భేనిగోపాల్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాలి



చర్చిస్తున్న మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్‌రెడ్డి

ముత్తారం: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం ముత్తారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారులు, కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు, పగుళ్లకు మరమ్మతు చేపట్టి, తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. నీటి ఎద్దడి నెలకొన్న గ్రామాల్లో ట్యాంకర్లతో తాగునీటి సరఫరాకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అవినీతి రాజకీయాల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

రామగుండం: దేశంలో ప్రధాని మోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా, పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మతతత్వ, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంఘాల ప్రతినిధులు గుమ్ముల వెంకన్న, తీగుట్ల రాములు, బర్పటి మల్లన్న, దేవేందర్, శ్రీనివాస్, నవీన్, లగిశెట్టి రామచంద్రం, మల్లేశ్, చంద్రయ్య, రాజు, బర్పటి రాజయ్య ఉన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత గోమాసకు లేదు'



మాట్లాడుతున్న గుమ్మడి కుమారస్వామి

గోదావరిఖని: అవకాశవాద రాజకీయాలకు పాల్పడిన గోమాస శ్రీనివాస్ ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ సీనియర్ నేత గుమ్మడి కుమారస్వామి అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే అనేక పార్టీలు మారిన గోమాస శ్రీనివాస్‌కు కాంగ్రెస్‌ను, వివేక్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. సమావేశంలో నాయకులు పంజా శ్రీనివాస్, గడ్డం సతీశ్, చంద్రమోహన్, మూర్తి పాల్గొన్నారు.

30న 'ఖని' బార్ అసోసియేషన్ ఎన్నికలు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఎన్నికలు 30న నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం ఖని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో 2023–24కి గాను ఎన్నికల ఎలక్షన్ ఆఫీసర్‌గా నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి, ఉమెన్ ఎగ్జిక్యూటివ్ లేడి రిప్రజెంటివ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ, లైబ్రరీసెక్రటరీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు



పాలకుర్తి: హోలీ సంబరాల్లో చిన్నారులు

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లిలోని జేమ్స్ మోడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం చిన్నారులు రంగులు చల్లుకున్నారు. కరస్పాండెంట్ జాలపల్లి మహేశ్, హెచ్‌ఎం స్వప్న పాల్గొన్నారు.

గాయత్రిలో సంబరాలు



పెద్దపల్లిరూరల్: గాయత్రిలో హోలీ వేడుకలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ సంబరాలు నిర్వహించారు. వేడుకల్లో కరస్పాండెంట్ అల్లెంకి రజనీ, విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దిన్, నవీన్, ప్రవంతి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి

సుల్తానాబాద్: గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రాంతాలను గుర్తించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేసవికాలం ప్రారంభమైనందున గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు సరఫరా తీరు, లీకేజీలు నీటి కొరతపై కార్యదర్శులు నివేదిక తయారు చేసి అందజేయాలని ఆదేశించారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీశ్, ఏఈ కోర్‌నాల్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు సన్మానం



వంశీకృష్ణను సన్మానిస్తున్న అభిమానులు

రామగుండం: కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తన తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే డాక్టర్ వివేక్‌వెంకటస్వామితో కలిసి హైదరాబాద్ నుంచి చెన్నూర్ వెళ్తుండగా మార్గమధ్యంలో శనివారం కుందనపల్లి ఐవోసీ ఎక్స్‌రోడ్ వద్ద అభిమానులు వారిని సన్మానించారు. రామగుండం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనుమాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇఫ్తికార్, శ్రీనివాస్, గొల్లపల్లి వెంకటేశం ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

సుల్తానాబాద్: రాబోయే వర్షాకాలంలో హరిత హారంలో పకడ్బందీగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు అన్నారు. శనివారం పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న నర్సరీని వారు సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు కూకట్ల గోపి, చింతల సునీత, దున్నపోతుల రాజయ్య, నిషాద్, రఫీక్, నర్సరీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

గోదావరిఖని: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం స్థానిక తిలక్‌నగర్‌లో తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించారు. కేంద్రం పేదవారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, ఆయుస్మాన్ భారత్ కింద రూ.55కోట్ల లబ్ధిదారులకు రూ.5లక్షల ఆరోగ్య రక్షణ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో అడ్డూరి రాజేశ్, మాతంగి రేణుక, మామిడి రాజేశ్, సల్ల వేణురెడ్డి, మామిడి సంపత్, అరిగెల శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటా ప్రచారం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య శనివారం ప్రచారం నిర్వహించారు. పీఎం మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.

కార్పొరేషన్‌ను సుందరంగా మార్చడానికి కృషి



దప్పు చాటింపు వేస్తున్న మున్సిపల్ కార్మికులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ప్రాంతాన్ని సుందరంగా మార్చడానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. శనివారం 23వ డివిజన్ ఆటోనగర్, సుభాష్‌నగర్‌లో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంట్లోని చెత్తను తడి, పొడి చెత్తగా విడదీసి.. చెత్త సేకరించే వాహనాలకు అందించాలని సూచించారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేసి మొక్కలకు ఉపయోగించవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా తిరిగి ఉపయోగించుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేషన్ సిబ్బంది సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి షెడ్డులోని కంపార్టుమెంట్‌లో వేసి ఎరువుగా మార్చి హరితహారంలో పెంచుతున్న మొక్కలకు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటింటా చెత్త సేకరణలో ఉపయోగించే బండ్లలో చెత్త వేయని వారిపై జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగ, అధికార గుర్తింపు సంఘం నాయకులతో పాటు వివిధ యూనియన్ల ప్రతినిధులు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, సూపర్‌వైజర్ సంపత్ ఉన్నారు.

ముగిసిన బీజోన్ స్థాయి క్రికెట్ పోటీలు

- విజేత మంథని జేఎన్టీయూ జట్టు



కప్ అందుకుంటున్న మంథని జేఎన్టీయూ జట్టు

రామగిరి: మంథని జేఎన్టీయు కళాశాలలో ఐదు రోజులుగా జరిగిన బీజోన్ స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో మంథని జేఎన్టీయూ జట్టు వరంగల్‌కు చెందిన వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలపై నెగ్గి విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన మంథని జట్టు 123 పరుగులు సాధించగా, వాగ్దేవి జట్టు 100 పరుగులకు ఆలౌట్ అయింది. ఉత్తమ ప్లేయర్, ఉత్తమ బ్యాటర్లుగా వాగ్దేవికి చెందిన రితిన్, సాయి, ఉత్తమ బౌలర్‌గా మంథని జేఎన్టీయూకు చెందిన విష్ణు రాథోడ్ ఎంపికయ్యారు. ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అనుపమ్ ఆదర్శ్ హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో ఇంజనీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా చైర్మన్, సింగరేణి అడిషనల్ జీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, రీజనల్ బ్యాంక్ మేనేజర్ పియూష్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



పెద్దపల్లిరూరల్: నివాళి అర్పిస్తున్న నాయకులు



జ్యోతినగర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ అన్నారు. శనివారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. రాజేశ్వరి, స్వామి, ప్రకాష్, లింగయ్య, మధునమ్మ, రజిత, కొమురక్క పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: విప్లవవీరుడు భగత్‌సింగ్ వర్ధంతి శనివారం పెద్దపల్లిలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం, ఏఐవైఎఫ్ నాయకులు అంజి, సురేందర్, నవీన్, సదానందం, రాకేశ్, కిరణ్, రమేశ్ ఉన్నారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముత్తునూరి సంపత్, నీర్ల భాగ్య, నరసింహచారి, పుష్ప, సంధ్య, మహాలక్ష్మి, రవి, లింగయ్య, వాణి పాల్గొన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో నివాళి అర్పించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు తోకల రమేశ్‌తో పాటు ఆడెపు శంకర్, పోషం, రాయమల్లు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయవ్యాధి నియంత్రణ సాధ్యం



సుల్తానాబాద్‌రూరల్: ర్యాలీలో వైద్యులు

జూలపల్లి: అవగాహనతోనే క్షయవ్యాధి నియంత్రణ సాధ్యమని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అన్నారు. జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌వీ వసంత, సీహెచ్‌వో కలీమొద్దీన్, ఏఎన్‌ఎంలు విజయ, అనంతరావ్ పాల్గొన్నారు.

టీబీ రోగులకు ఉచిత వైద్యం

సుల్తానాబాద్‌రూరల్: టీబీ వ్యాధి రోగులకు ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోందని గర్రెపల్లి పీహెచ్‌సీ వైద్యుడు అనుదీప్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎలిగేడు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో శనివారం టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో టీబీ వ్యాధి అనుమానితులు పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ విజయేందర్ రాజు, ఆరోగ్య విద్యాబోధకురాలు రాజేశ్వరిదేవి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జూలపల్లి: అవగాహనతోనే క్షయవ్యాధి నియంత్రణ సాధ్యమని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌వీ వసంత, సీహెచ్‌వో కలీమొద్దీన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామశివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శనివారం తెల్లవారుజామున మైనింగ్ సిబ్బంది పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండల పరిధిలోని మానేరువాగు నుంచి ఇసుకను మండలంలోని గ్రామాలకు అక్రమంగా సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల ఉమ్మడి కన్నాలకు చెందిన సాండ్‌ట్యాక్సీ ఓనర్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కన్నాల గ్రామ శివారులోని ఉర్సు గుట్ట సమీపంలో అక్రమంగా ఇసుకను తీసుకవస్తున్న నాలుగు ట్రాక్టర్లను గ్రామస్తులు, మైనింగ్ సిబ్బంది పట్టుకుని బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలి

రామగిరి: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీవో శైలజారాణి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

పోషకాహారం తీసుకోవాలి

కమాన్‌పూర్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ రవూఫ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక పక్వాడ నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. మంథని ఇన్‌చార్జి సీడీపీవో స్వరూప, సూపర్‌వైజర్లు లక్ష్మి, అనిత, స్వరూప, శారద, అనిత పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం

ఓదెల: గ్రామాల్లోని మురికి కాలువల పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం అవుతాయని ఎంపీవో భాస్కర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఎంపీవో సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు మహేందర్ రెడ్డి, భానుప్రసాద్, సత్యనారాయణరెడ్డి, ఆవుల శ్రీనివాస్, శ్రీకాంత్, సందీప్, దిలీప్, వెంకటేశ్, చంద్రశేఖర్, నవ్య, మీనా పాల్గొన్నారు.